క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలో మేడి సీత అనే మహిళ ఈ నెల 12న గుండెపోటుతో మృతి చెందింది. అదే గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కాకి సోమయ్య ఈ నెల 15న మృతి చెందాడు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల చొప్పున సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, డి.శ్రీరామ్మూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్లు సుధీర్‌కుమార్, ఎ.దుర్గాపావని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరంలో బీఎస్పీ బహిరంగ సభ

ఉండ్రాజవరం: బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉండ్రాజవరంలో నిర్వహించే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలి రావాలని ఆ పార్టీ నిడదవోలు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మర్రి మహాలక్ష్మడు కోరారు. ఉండ్రాజవరంలో మంగళవారం ఆ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మడు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పరంజ్యోతి హాజరవుతున్నారన్నారు.

ముక్కామలలో మహిళకు డెంగీ

పెరవలి: మండలంలోని ముక్కామల గ్రామంలో ఓ మహిళకు డెంగీ సోకింది. వారం రోజులుగా ఆమెకు జ్వరం తగ్గకపోవడంతో వైద్య పరీక్షలు చేయగా, డెంగీగా నిర్ధారణ అయ్యిందని పెరవలి పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్ విజయ కుమార్ తెలిపారు. ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగానే ఉందని, రెండు రోజుల్లో ఇంటికి పంపిస్తారని తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. అట్లపాడుకు చెందిన బొంతా మౌనికకు గోపాలపురం మండలం రామపాలెంకు చెందిన కుమారరాజుతో 2015లో వివాహమైంది. ఇటీవల భర్త కుమారరాజుతో పాటు అతడి కుటుంబ సభ్యులు కట్నం కోసం తనను వేధిస్తున్నారని బాధితురాలు మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రోన్ల వినియోగానికీ ఓ కోర్సు

- సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించిన ఏయూ
- తాడేపల్లిలో డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ సెంటర్
- శిక్షణకు జిల్లా నుంచి 30 మంది హాజరు

నల్లజర్ల: ఒకప్పుడు డ్రోన్‌ల వినియోగం కొన్ని రంగాలకే పరిమితం. ఇప్పుడవి అన్ని రంగాలకూ విస్తరించాయి. ఫోటోగ్రఫీ నుంచి పురుగు మందుల పిచికారీ వరకూ భిన్న రంగాల్లో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. భూముల సర్వేలోను, రక్షణ శాఖలోను వ్యవసాయ రంగంలోను డ్రోన్‌లను ఇప్పుడు విస్తృతంగా వాడుతున్నారు. ఎన్నో ప్రైవేట్ సంస్థలు కూడా వీటి సేవలను వినియోగించుకుంటున్నాయి. వీటి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయం డ్రోన్‌లపై రాష్ట్రంలోనే తొలిసారిగా సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించింది. ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సు నిర్వహణకు శ్రీకారం చుట్టారు. జియో ఇంజినీరింగ్ బీటెక్, ఎంటెక్ చదువుతున్న పలువురు విద్యార్థులు ఈ కోర్సులో చేరారు. ఏయూ జియో ఇంజినీరింగ్ విద్యార్థులకు డ్రోన్‌ల వినియోగంపై కొంత అవగాహన ఉంది. దాంతో వారికి కేవలం 30 రోజుల శిక్షణ సరిపోతుంది.

డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ సెంటర్‌ను వ్యవసాయ శాఖలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఇస్తున్న శిక్షణకు తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరయ్యారు. వారిలో నల్లజర్ల మండలం అనంతపల్లి నుంచి అభ్యుదయ రైతు తమ్మిశెట్టి నాగమల్లికార్జునరావు కూడా శిక్షణ పొందారు. వ్యవసాయ శాఖ ద్వారా డ్రోన్ పొందాలంటే ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడాలి. అందులో ఒకరు ఇంటర్ పాసై ఉండాలి. అతడిని శిక్షణకు ఎంపిక చేస్తారు. పాస్‌పోర్టు కూడా ఉండాలి. అతనికి కిసాన్ డ్రోన్ ప్రోగ్రాం డిగ్రో డ్రోన్స్‌లో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తారు. అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. డ్రోన్ కొనుగోలుకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుంది. అందులో 40 శాతం రాయితీ ఉంటుంది. ప్రమాదాలు జరిగినపుడు పరిహారం అందించేలా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కూడా చేస్తారు.



భూముల సర్వేకు రెవెన్యూ శాఖ వినియోగిస్తున్న డ్రోన్ (ఫైల్)



వ్యవసాయశాఖ ద్వారా డ్రోన్ శిక్షణ పూర్తిచేసిన అభ్యుదయ రైతు తమ్మిశెట్టి నాగమల్లికార్జునరావుకు సర్టిఫికెట్ అందిస్తున్న జేడీఏ మాధవరావు(ఫైల్)

వ్యవసాయ రంగానికి మేలు



డ్రోన్ సర్వే ఆఫ్ మ్యాపింగ్ వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేస్తుంది. నీటి లభ్యత, ఎంత పరిమాణంలో నీటిని వాడాలి, ఏ మోతాదులో ఎరువులు వాడాలి వంటి వివరాలు డ్రోన్‌ల ద్వారా కచ్చితంగా తెలుస్తాయి. దీనివల్ల రైతుకు నీరు, ఎరువులు ఆదా అవుతాయి. కూలీల ఖర్చులు తగ్గుతాయి. నల్లజర్ల మండలానికి మరో రెండు డ్రోన్‌లు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆధునిక పద్ధతుల ద్వారా సాగుచేసే అభ్యుదయ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

డబ్బు, సమయం ఆదా



సాధారణంగా మూడెకరాల్లోని పంటకు వినియోగించే పురుగు మందు ద్రావణాన్ని డ్రోన్‌తో పిచికారీ చేస్తే ఐదు ఎకరాల పంటకు సరిపోతుంది. సమయం కలిసి వస్తుంది. కూలీల ఖర్చు ఆదా అవుతుంది. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. వీటిని అధిగమించేందుకే మా గ్రూపు సభ్యులు డ్రోన్ కొనుగోలుకు యత్నించాం.

– నాగ మల్లికార్జునరావు, డ్రోన్ శిక్షణ పొందిన రైతు, అనంతపల్లి

నేడు నిడదవోలులో 'జగనన్నకు చెబుదాం'

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణ, మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ మంగళవారం తెలిపారు. నిడదవోలులోని కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరై, ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు హాజరవుతారని, నిడదవోలు పట్టణ, మండల ప్రజలంతా తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని ఎంపీడీఓ పి.శామ్యూల్, కమిషనర్ కేవీ పద్మావతి పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గోపాలపురం: తీవ్రంగా గాయపడిన గోపాలపురానికి చెందిన గోళ్ల రమణమ్మ (70) అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమణమ్మ సోమవారం తన ఇంటి బాత్‌రూమ్‌లో కాలి జారి కింద పడడంతో ఆమె తలకు బలమైన గాయమైంది. దీంతో ఆమెను గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు పోశారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అర్హతల మేరకు అందరికీ సంక్షేమ ఫలాలు

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు సచివాలయం-3 పరిధిలో గడప గడపకూ..



చాగల్లులో ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: గత నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో అర్హతల ప్రకారం రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు లభించాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు సచివాలయం-3 పరిధిలో మంగళవారం ఆమె 145వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడి కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ వీధి నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్ లెట్‌లను అందజేశారు. మహిళలు, అభిమానులు హారతులు ఇస్తూ హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయని మంత్రి వనతిత అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్ర కుమార్, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్ష ,అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు



ఖండవల్లి కనకదుర్గమ్మ అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు

- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు
- 267 మంది దంపతులతో సహస్ర కుంకుమ పూజలు



నల్లజర్లలో వనదుర్గాదేవికి గాయత్రీదేవి అలంకారం



విశేష స్వర్ణాభరణములతో కోటసత్తెమ్మ వారు



తాళ్లపూడిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణ అలంకరణలో దేవరపల్లి మండలం బందపురంలో దుర్గాదేవి

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయానికి మూడో రోజైన మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి 267 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,40,020 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం చెప్పారు. కోటసత్తెమ్మ వారిని విశేష స్వర్ణాభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు .

అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి

కొవ్వూరు: సీతంపేటలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ వారిని హోం మంత్రి తానేటి వనిత దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు.

నల్లజర్ల: గ్రామంలోని నల్ల-ఎర్ర చెరువు గట్టున గల వన దుర్గాదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి గాయత్రీదేవిగా అలంకరించారు.విశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతపల్లి స్వర్ణ దుర్గాశ్రమంలో ఉద్దగిరి వెంకటరత్నం, అన్నపూర్ణమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అన్నసమారాధన జరిగింది.

దేవరపల్లి: స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారిని, బాలదుర్గమ్మ వారిని, విజదుర్గా అమ్మవారిని, బందపురంలో కోదండ రామాలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. దేవరపల్లిలోని మూడు బొమ్మలు, బస్టాండ్ సెంటర్లు విద్యుత్తు కాంతులతో దగదగలాడుతున్నాయి.

పెరవలి: ఖండవల్లి కనకదుర్గమ్మ వారికి వందలాది మంది సామూహిక కుంకుమ పూజలు చేశారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల్లో అమ్మవారిని వందలాది భక్తులు దర్శించుకుని దీవెనలు పొందారు.ముక్కామలలో గాయత్రిదేవీ అవతారంలో అమ్మవారిని అలంకరించారు.

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ వారికి మంగళవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీ దేవి ఆలయంలోను, మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలోను విశేష పూజలు చేశారు. పలు గ్రామాల్లో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి.

మలకపల్లిలో కొనసాగిన ప్రచారం

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ఆ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మండలంలోని మలకపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారం మూడో రోజైన బుధవారం కూడా కొనసాగింది. ఆ పార్టీ నాయకుడు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందించారు. ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పూడి వరలక్ష్మి, సూదిన అనిత పద్మ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రార్థనలు చేయండి



చర్చిలో ప్రార్థన చేస్తున్న ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు గేరా హనోక్, హోం మంత్రి తానేటి వనిత తదితరులు

కొవ్వూరు: సైతానుల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు దైవజనులంతా ప్రార్థన చేయాలని హోం మంత్రి తానేటి వనిత కోరారు. అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో స్థానిక నియో కాన్సెప్ట్ క్రైథడల్ చర్చిలో మంగళవారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. మునిసిపాలిటీ ద్వారా క్రైస్తవులు బాప్టిజం తీసుకోవడానికి అవసరమైన రేవు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. విజయవాడలో రెండు లక్షల మందితో నిర్వహించే సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గెరా హనోక్ మంత్రి వనితను కోరారు. క్రైస్తవులపై దాడులు కొనసాగుతున్నాయని, వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు కృపా శామ్యూల్,రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, జిల్లా గౌరవాధ్యక్షుడు బిషప్ మెంటే బాబు, ప్రెసిడెంట్ గెల్లా రాజేష్, కార్యదర్శి ఇజ్రాయేలు,ట్రెజరర్ ముప్పిడి బుజ్జిబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం,గుణ తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ తరఫున హోమ్ మంత్రి వనితను సత్కరించారు.

పేదలకూ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



తాళ్లపూడి మండలం తాడిపూడిలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



నల్లజర్ల మండలం సింగరాజుపాలెంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో మందుల కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ



పెరవలి మండలం తీపర్రులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

- అందుకే జగనన్న సురక్ష వైద్య శిబిరాలు
- హోం మంత్రి తానేటి వనిత
- తాడిపూడి శిబిరంలో రోగులకు మందుల పంపిణీ
- డివిజన్ వ్యాప్తంగా పలుచోట్ల వైద్య సేవలు

తాళ్లపూడి: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పేదలు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి వనిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. డాక్టర్ దుర్గాభవాని ఆధ్వర్యంలో గ్రామంలోని 200 మందికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మంత్రి వనిత చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్ల ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మండిగ గిరిధర్, తహసీల్దార్ టి.రాధిక, నాయకులు తోట రామకృష్ణ, పోశిన శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలం సీతంపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో 567 మందికి వైద్య సేవలందించారు.

వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తీసుకోండి

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు హాజరయ్యే వృద్ధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నిర్వాహకులకు సూచించారు. మండలంలోని కొవ్వూరుపాడు సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా వైద్యులు పని చేయాలన్నారు. శిబిరంలో 255 మందికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో తొమ్మిది మందిని మెరుగైన వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్టు డాక్టర్ కె. శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, గోపాలపురం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాజుపాలెంలో 728 మందికి..

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని సింగరాజుపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి శిబిరాన్ని ప్రారంభించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు. రోగులకు మందులు అందజేశారు. ఈ శిబిరంలో పిల్లల వైద్యురాలు శ్రావణి, జనరల్ మెడిసిన్ సుమంత్ 728 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.11 మంది రోగులను రిఫరల్ ఆసుపత్రులకు పంపారు. తహసీల్దార్ కిశోర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వామిశెట్టి పరమేశ్వరరావు, నెక్కలపూడి విజయలక్ష్మి, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, వెంకటస్వామి, పిచ్చుకుల ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నాయగూడెంలో 518 మందికి..

దేవరపల్లి: చిన్నాయగూడెం సచివాలయం-2 వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. డాక్టర్లు నాగదేవి, హరిచందన్, హర్షవర్ధన్, చక్రవర్తి, శాంతకమల, కె.నాగేశ్వరరావు శిబిరంలో 518 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ డి.జ్యోతిరాణి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, గడా రాంబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఆచంట అనసూయ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలులో 242 మందికి..

నిడదవోలు: పట్టణంలోని చర్చిపేట సచివాలయం పరిధిలోని ప్రజల కోసం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హేనా నేతృత్వంలో ఇద్దరు వైద్య నిపుణులు, ఇద్దరు వైద్యులు 242 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రోగులకు ఉచితంగా మందుల కిట్‌లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైద్యాధికారి ఈ.తేజశ్రీ , వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు గుర్రం శాంతిశ్రీ , కొత్తపల్లి సుప్రియ, ముంగంటి మాణిక్యమాల, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరుమామిడిలో 406 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ అంబటి గోపమ్మ, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య మంగళవారం ప్రారంభించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్య పర్యవేక్షణలో వైద్య నిపుణులు 406 మంది రోగులను పరీక్షించి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కె.శేషు, ఉప్పల కాశీ, రాపాక వెంకట్రావు, పెద్దిరాజు, ఎంపీడీఓ పి.శామ్యూల్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యారావుపాలెంలో 550 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌జే ఇర్ఫాన్ (జనరల్ మెడిషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ రాజనాల ప్రసాద్ (ఎండీ), డాక్టర్ పి.మహేశ్వరరెడ్డి, డాక్టర్ పి.ఉమాశంకర్‌లు 550 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వారికి మందులు పంపిణీ చేశారు. వారిలో 24 మందిని వివిధ ఆపరేషన్ల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యురాలు పెదప్రోలు వెంకటలక్ష్మి, సర్పంచ్ మెండే లలితకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుద్దిపూడి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

తీపర్రులో 532 మందికి..

పెరవలి: మండలంలోని తీపర్రు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. రోగులకు ఆయన మందుల కిట్‌లు అందించారు. ఈ శిబిరంలో 532 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల నిమిత్తం వారిలో 21 మందిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని స్థానిక వైద్యురాలు తేజశ్రీ తెలిపారు. శిబిరంలో గైనకాలజీ, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు ఘణ్ముకవర్మ, ఎస్.శ్రీజ, ఏఎస్ కృష్ణవేణి, హేమరాజు రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుందుల భూపతిరావు, సర్పంచ్ కోటిపల్లి శ్రీదేవి, సొసైటీ అధ్యక్షుడు బలుసు రంగారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ సేకరిస్తాం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటావు
- కొవ్వూరుపాడులో కొనుగోలు కేంద్రం ప్రారంభం



గోపాలపురం మండలం కొవ్వూరుపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గోపాలపురం: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కొవ్వూరుపాడు రైతుభరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు వారికి ధాన్యాన్ని విక్రయించవద్దన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధరకు ఏర్పాటు చేసిన రైస్ మిల్లులకు విక్రయాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, ఎస్‌కే వల్లీ, సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి సూరిబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె మస్తాన్‌బాబా తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి ఏఓ బి. రాజారావు పాల్గొన్నారు.